కె. బి. కృష్ణ

# మౌన నాట్యం

నరసారావుపేట దగ్గర కోటప్పకొండ తిరునాళ్ళ భక్తిమాట దేవుడెరుగు.

ఆడా మగా విచక్షణ లేకుండా తిరునాళ్ళు జరుపుకుంటున్నారు జనం.

ఆ తిరునాళ్ళలో ఒక బండిమీద రికార్డింగ్ డ్యాన్స్ జరుగుతుంది. మిగతా బళ్ళమీదకూడా డ్యాన్స్‌లు జరుగుతున్నాయి.

మాలిని ఒక గంటనుంచి డ్యాన్స్ చేస్తుంది.

"ఏస్కో కోకో కోలా"

"సూదిలో దారం-సందులో బేరం"

"కరిగిపోతుంది ఒక చినుకూ"

"నీ కౌగిలిలో తలదాచి"

"బావలు సయ్యా-మరదలు సయ్యా"

మాలిని మత్తెక్కించే కళ్ళు సొగసయిన నడుము వొంపులు. మత్తెక్కించే వక్షస్థలం సినీరికార్డుతో కలిసి ఊగుతుంటే జనం నాటుమందు కొట్టినట్లుగా పిలయిపోయి విజిల్స్ వేస్తున్నారు. మరో ప్రక్కనుంచి భక్తులు "చేదుకో కోటయ్యా" అంటూ అరుస్తున్నారు.

మాలినికి ఆయాసం వచ్చింది. కాస్సేపు తబలా వాళ్ళని మ్యూజిక్ కొట్టమని తెరతీసుకొని లోపలకు వచ్చి కూర్చుంది. కొంచెంసేపు మ్యూజిక్ విన్నారు జనం. "డ్యాన్స్ వెయ్యాలి" అని కేకలు వేయసాగారు.

మాలిని లోపలకు రాగానే చాలా సేపటినుండి ఏడుస్తున్న తన బాబు నోట్లో పాలసీసాపెట్టి కన్నీటి పొరలతో వాడిని చూస్తుంది.

తనకు ఎదురుగా తన భర్త మరో స్త్రీ కొత్తగా వచ్చిన నాట్యగత్తెతో ప్రేమమైకంలో మునిగి తేలుతున్నాడు.

తన భర్త వడిలో వున్న జమున అనే సుందరాంగితో భయంగా అంది మాలిని. "కాసేపు డ్యాన్సు చేయమని"

దానికి భర్త ఏమో నీకు అప్పుడే బలిసిందా దాన్ని డ్యాన్స్ చేయ మంటావా?" అన్నాడు జమునను ఇంకా పొదివి పట్టుకుని.

"ఏం ఎన్నాళ్ళు ఇంక నీ కౌగిలిలో కులుకుతుంది. నేనే వొళ్ళు చచ్చి పుండు అయ్యేటట్లు డ్యాన్స్ చెయ్యాలా, అది చెయ్యదా? అంది కన్నీటితో.

"చూడు డియర్ అది నిన్ను ఎలా అంటుందో" అని గారాలు పోయింది జమున దాని హొయలుకు కరిగిపోయాడు.

"నీ యవ్వ లేచెళ్ళి డ్యాన్స్‌చెయ్ జనం గోలచేస్తున్నారు" అని అరిచాడు. బయట బండిముందు గోలగావుంది. జనం బండిచుట్టూ తిరిగి గోల చేస్తున్నారు. ఈ రోజు అదో నేనో తేలిపోవాలి నేను డ్యాన్స్ చెయ్యను" అంది మాలిని.

"అలాగా" అని మాలిని చేతిలో పసికందును తీసుకుని కాళ్ళు పైకెత్తి పట్టుకొని నువ్వెళ్ళి డ్యాన్స్ చెయ్యలేదనుకో వీడ్ని పైకి విసిరేస్తాను" అన్నాడు ఆమె భర్త.

వొద్దు దుర్మార్గుడా నేను వెళ్తాను అంది మాలిని. అనడమే ఆలశ్యం తెరముందుకు వెళ్ళి—

"రా రా నా కౌగిలి చేరరా దొరా" అంటూ వయ్యారాలు వొలికిస్తూ డ్యాన్స్ చేస్తోంది మాలిని. కళ్ళు కైపుగా నడుము వయ్యారంగా తిప్పుతూ—

ఆ కైపుగా చూస్తూన్న కళ్ళలో ఎఱ్ఱని జీర, కంటినిండా నీరు- ఆమె హృదయంనిండా ఆవేదన!

"అబ్బ పిచ్చెక్కించేస్తుందిరా ఇది బెడ్‌మీదయితే—అనుకుంటున్నారు జనం.

తిరునాళ్ళ జనం....పిచ్చిజనం.

....0....